క్లుప్తంగా

కూలి రేట్లు పెంచడంపై హర్షం

భువనగిరిటౌన్ : సివిల్ సప్లయ్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న హమాలీ కార్మికుల కూలి రేట్లు పెంచడం హర్షణీయమని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ అన్నారు. కూలి రేట్లు పెరిగిన సందర్భంగా శుక్రవారం సివిల్ సప్లయి గోడౌన్ వద్ద హమాలీలకు మిఠాయిలు పంచి పెట్టారు. ఏఐటీయూసీ పోరాటాల ఫలితంగానే సివిల్ సప్లయ్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న హమాలీ కార్మికుల కూలి రేట్లు పెరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె శ్రీనివాస్, ఏఐటీయూసీ జిల్లా కమిటీ సభ్యులు సామల భాస్కర్, నాయకులు పాపగళ్ల శంకరయ్య, గౌరవంతుల శ్రీనివాస్, పురుగుల రవి, వల్లస్ నర్సింహ, పిన్నం జగన్, బొజ్జ గణేష్, కిష్టయ్య, ఇటుకల వెంకటేష్, స్వామి, నర్సింహా, కష్ట, మైసయ్య, మల్లేష్, స్వామి, మంగ చంద్రయ్య, నరేష్, కరుణాకర్, వంశీ, స్వీపర్లు శోభ, శారద పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చెరువులు నింపాలి



మాట్లాడుతున్న దయ్యాల నర్సింహ

భువనగిరి రూరల్ : బునాదిగాని కాల్వ ద్వారా మండలంలోని అనాజీపురం, నందనం చెరువులను నింపాలని సీపీఎం మండల కార్యదర్శి దయ్యాల నర్సింహ అన్నారు. మండలంలోని నందనం గ్రామంలో ఆ పార్టీ గ్రామ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శివర్గ సభ్యుడు ఏదునూరి మల్లేశం, సంఘం జిల్లా అధ్యక్షుడు సిరిపంగ ప్రకాష్, మండల కమిటి సభ్యుడు కొండాపురం యాదయ్య, కొల్లూరి సిద్దిరాజు, సిలివేరు భూపాల్ రెడ్డి, లచ్చిరెడ్డి, ఆంద్రయ్య, కొల్లూరి శ్రీకాంత్ పాల్గొన్నారు.

సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలి



పంట పొలాలను పరిశీలిస్తున్న డీఏఓ గోపాల్

బొమ్మలరామారం : సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ అన్నారు. పంటల నమోదు ప్రక్రియలో భాగంగా శుక్రవారం మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలో వరి చేలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.అధిక దిగుబడులు సాధించేందుకు రైతులకు పలు సలహాలు సూచనలు ఇచ్చారు. వరిలో ఆశించే మొగి పురుగు, దోమ కాటు లాంటి సమస్యలు పరిష్కరించుకునేందుకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఏఈఓ వెంకటేష్, రైతులు కృష్ణ, శివ ప్రసాద్, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్లంబింగ్ పనులపై శిక్షణ



ప్లంబింగ్ పనులపై అవగాహన కల్పిస్తున్న మిషన్ భగీరథ అధికారులు

వలిగొండ : మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న మంచినీటి సరఫరా సహాయకులకు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ప్లంబింగ్ పనులపై ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు శిక్షణ నిర్వహించారు. మూడో రోజు నిర్వహించిన శిక్షణలో మిషన్ భగీరథ అధికారులు పాల్గొని ప్లంబింగ్ నిర్మాణాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జితేందర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ప్రశాంతకుమార్, ఎంపీఓ కేధారేశ్వర్, ఏఈలు మహేష్, శ్రీలత, సిబ్బంది పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు మానుకోవాలి

సంస్థాన్ నారాయణపురం : కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాలు మానుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు జక్కలి ఐలయ్యయాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని జనగాం గ్రామంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. సమావేశంలో పార్టీ మండల, గ్రామ అధ్యక్షులు కరెంటోత్ శ్రీనివాస్, గడ్డం రవి, జిల్లా ఉపాధ్యక్షుడు మందుగుల బాలకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కరెంటోత్ భిక్షపతినా యక్, గడ్డం శంకరయ్య, బెల్లంకొండ శంకర య్య, నర్సింహ, మల్లయ్య తదితరులున్నారు.

ఇసుక తరలిస్తున్న ట్రాలీఆటో పట్టివేత

ఆలేరురూరల్ : మండలంలోని కొలనుపాక వాగు నుంచి అనుమతులు లేకుండా ఉదయ్ అనే వ్యక్తి శుక్రవారం తన ట్రాలీఆటోలో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ విషయంపై కేసు నమోదు చేసి ఆటోను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ రజనీకర్ తెలిపారు.

నాలుగు దాటితే తాళమే..!

- గుండాల పీహెచ్‌సీలో సాయంత్రం నాలుగు గంటల వరకే అందుతున్న వైద్యసేవలు
- రాత్రివేళల్లో ప్రభుత్వ వైద్యం అందక ఇబ్బందులు
- 24 గంటల వైద్య సదుపాయం అందించాలని ప్రజల వేడుకోలు



సాయంత్రం వేళ తాళం వేసి ఉన్న గుండాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

గుండాల : ప్రభుత్వాస్పత్రుల్లో వసతులు మెరుగుపరిచాం.. అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాం... గ్రామీణ ప్రజలకు 24 గంటలూ వైద్య సేవలందుతున్నాయంటూ ప్రజాప్రతినిధులు పలు సందర్భాల్లో చెబుతుంటారు. కానీ, క్షేత్ర స్థాయిలో మాత్రం ఆ పరిస్థితులు అలా లేవు. సాయంత్రం 4 గంటలు దాటితే చాలు పీహెచ్‌సీలకు తాళాలు పడుతున్నాయి. దీంతో రాత్రి వేళల్లో ప్రభుత్వ వైద్యం అందక ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది.

ఒక్కటే పీహెచ్‌సీ..

గుండాల మండలంలోని 20 గ్రామ పంచాయతీలున్నాయి. అయితే మండల కేంద్రంలో మాత్రమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మాత్రమే ఉండగా.. మండలం మొత్తం కలిపి 8 సబ్ సెంటర్లు, ఐదు పల్లె దవాఖానాలు, ఒక ఆయుర్వేదిక్ ఆస్పత్రి ఉంది. మండల కేంద్రంలో ఉన్న పీహెచ్‌సీలో 24గంటల వైద్య సదుపాయం లేకపోవడంతో రాత్రివేళల్లో అత్యవసర వైద్యానికి వచ్చే వారికి నిరాశ ఎదురవుతోంది. విలువైన సమయం వృథా అవుతుండడంతో కొందరి ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. రాత్రి సమయంలో రోడ్డు ప్రమాదాలు జరిగినా.. పాము, కుక్క కాటుకు గురైన తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అత్యవసర పరిస్థితులలో ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు.

సబ్ సెంటర్లలో సిబ్బంది కొరత

మండలంలోని 8 సబ్ సెంటర్లకు 8 మంది ఏఎన్ఎం పోస్టులు ఖాళీగా ఉండడంతో ఆయా సబ్ సెంటర్లలో సెకండ్ ఏఎన్ఎంలే వైద్య సేవలు అందిస్తున్నారు. పెద్దపడిశాల, మాసాన్‌పల్లి గ్రామాల్లో ఏఎన్ఎంలు లేకపోవడంతో ఇతర గ్రామాల ఏఎన్ఎంలకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. సుద్దాల, సీతారాంపురం, గుండాల గ్రామాల్లోని సబ్ సెంటర్లలో మేల్ హెల్త్ అసిస్టెంట్స్, మేల్ సూపర్‌వైజర్, ఏపీఎంఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కొమ్మాయి పల్లి, సీతారాం పురం, మాసాన్‌పల్లి, పెద్ద పడిశాల, సుద్దాల పల్లె దవాఖానాల్లో కూడా వైద్యులు లేక ఎంఎల్‌హెచ్‌పీలే వైద్య సేవలందిస్తుడడంతో గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందడం లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో 24గంట వైద్య సదుపాయం కల్పించడంతో పాటు గ్రామాల్లోని సబ్ సెంటర్లు, పల్లె దవాఖానాల్లో మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సిబ్బందిని నియమించాలి



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24గంటల వైద్యం అందిచేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుని అందుకు అనుగుణంగా సిబ్బందిని నియమించాలి. ప్రస్తుతం 80 నుంచి 100 వరకు ఓపీ ఉంటుంది. వారందరికి వైద్య పరీక్షలు నిర్వహించి కావాల్సిన మందులను అందజేస్తున్నాం.

– హైమావతి, మండల వైద్యాధికారిణి

రద్దయిన రైళ్లను పునరుద్ధరించాలని వినతి



ఆలేరు రైల్వే స్టేషన్ మాస్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్షం నాయకులు

ఆలేరురూరల్ : ఇటీవల రద్దయిన ఎక్స్‌ప్రెస్ రైళ్లను పునరుద్ధరించాలని కోరుతూ శుక్రవారం అఖిల పక్షం ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్‌మాస్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం కమిటీ కన్వీనర్ పసుపునూరి వీరేశం మాట్లాడారు. గత నెల 23న సికింద్రాబాద్, విజయవాడ మధ్యలో రైల్వేలైన్ మరమ్మతు పనులు జరుగుతున్న నేపథ్యంలో ఐదు రైళ్లను రద్దు చేశారని, దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కాకతీయ ఎక్స్‌ప్రెస్, గోల్కొండ ఎక్స్‌ప్రెస్, భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్, సిర్పూర్ కాగజ్‌నగర్, పుష్పుల్ రైళ్లను తిరిగి పునప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో అఖిలపక్షం కోకన్వీనర్ రాచకొండ జనార్దన్, చెక్క వెంటేష్, ఎండీ సలీం, నంద గంగేష్, నరేందర్, బాంబె రవి, పంగ రవి, అశోక్, రచ్చ రామ్‌నర్సయ్య, బేతి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బునాదిగాని కాల్వ పూర్తయ్యే వరకు ఉద్యమిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ జహంగీర్

అడ్డగూడూరు : మండలానికి సాగు, తాగునీరు అందించే బునాదిగాని కాల్వ పూర్తయ్యే వరకు సీపీఎం ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ మండల కార్యదర్శి బుర్ర అనిల్ అధ్యక్షతన మండల మహాసభ నిర్వహించారు. ఈ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలం ఏర్పడి పదేళ్లు గడుస్తున్నా అభివృద్ధికిలో వెనుకబాటుకు గురైందన్నారు. పదేళ్ల నుంచి ప్రభుత్వాలు మారినా మండల వ్యాప్తంగా ఉన్న లింక్‌రోడ్లు, డ్రైయినేజీ సమస్యలు ఎక్కడివి అక్కడే ఉన్నాయన్నారు. మహాసభలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దాసరి పాండు, వల్లంభట్ల శ్రీనివాసరావు, చిత్తలూరి మల్లయ్య, శ్రీనివాస్, మాదాని ధామస్, ఎల్లయ్య పాల్గొన్నారు.

సీపీఎం మండల కార్యదర్శిగా అనిల్‌కుమార్

అడ్డగూడూరు : మండల కేంద్రంలో శుక్రవారం సీపీఎం మండల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా బుర్ర అనిల్ కుమార్‌ను, కమిటీ సభ్యులుగా వల్లంభట్ల శ్రీనివాస్, చిత్తలూరి మల్లయ్య, శీలం శ్రీనివాస్, మాదాని ధామస్,గూడెపు ఎల్లయ్య ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు దాసరి పాండు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే మందుల సామేల్



మోత్కూరు : సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

మోత్కూరు : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండలానికి చెందిన పలువురికి మంజూరైనా సీఎం రిలీఫ్ ఫండ్‌చెక్కులను శుక్రవారం మోత్కూరు మున్సిపల్ కార్యాలయంలో ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవిత, కమిషనర్ సి.శ్రీకాంత్, వైస్ చైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య, సింగిల్‌విండో చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు, జిల్లా కాంగ్రెస్ నాయకులు పైళ్ల సోమిరెడ్డి, గుర్రం లక్ష్మినర్సింహ్మారెడ్డి, అవిశెట్టి అవిలుమల్లు, మండల అధ్యక్షులు వంగాల సత్యనారాయణ, కార్యదర్శి రాచకొండ బాలరాజు గౌడ్, కారుపోతుల వెంకన్న, కౌన్సిలర్లు పురుగుల వెంకన్న, వనం స్వామి, కుమారస్వామి, కోఆప్షన్ సభ్యులు పోలినేని ఆనందమ్మ, షాహిన్‌సుల్తానా, మహిళా నాయకులు అన్నెపు పద్మ, ముద్దం జయశ్రీ పాల్గొన్నారు.

మూసీ నది ప్రక్షాళనకు సహకరించాలి

మోత్కూరు : మూసీ నది ప్రక్షాళనకు ప్రతిఒక్కరూ సహకరించాలి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శుక్రవారం మోత్కూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ నాగోల్‌లోని శుభం గార్డెన్స్‌లో శనివారం సాయంత్రం 4 గంటలకు జరగనున్న మూసీ నది ప్రక్షాళనపై చర్చకు రైతులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. మల్లన్న సాగర్ మునిగితే కనీసం స్పందించని హరీష్‌రావు మూసీ నది బాధితులపై గగ్గోలు పెడుతున్నారన్నారు. కేటీఆర్, హరీష్‌రావు మూసీ నది ప్రక్షాళనను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవిత, జిల్లా నాయకులు పైళ్ల సోమిరెడ్డి, గుర్రం లక్ష్మినర్సింహ్మారెడ్డి, అవిశెట్టి అవిలుమల్లు, మండల అధ్యక్షులు వంగాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బాలరాజు గౌడ్ ఉన్నారు.

వేమవరపు రత్నాకర్‌ప్రసన్న దంపతులకు నివాళి



వేమవరపు రత్నాకర్‌ప్రసన్న దంపతుల విగ్రహాలకు నివాళులర్పిస్తున్న నాయకులు

రామన్నపేట : మండలంలోని జనంపల్లి గ్రామంలో శుక్రవారం వేమవరపు రత్నాకర్ ప్రసన్న దంపతుల వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వారి విగ్రహాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వేమవరపు సుధీర్‌బాబు, మాజీసర్పంచ్ సర్పంచ్‌లు సంగిశెట్టి సుదర్శన్, పోచబోయిన మల్లేశం, రేఖ యాదయ్య, సింగిల్‌విండో డైరెక్టర్ నక్క యాదయ్య నాయకులు బండ రంగారెడ్డి, చలమల్ల లింగారెడ్డి, పబ్బు వెంకటేశం, వంగాల యాదయ్య, వంగాల ఉపేందర్, రేఖ సైదులు, నక్క నరేందర్, నడిగోటి సైదులు, నల్ల సైదులు, కన్నెబోయిన రవి, బైరు హరిక్రిష్ణ, ఆగు శ్రీశైలం, వంగాల శంకర్, సంగిశెట్టి వెంకటేశం పాల్గొన్నారు.

సీఎం, మంత్రి, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం

గుండాల : మండలంలోని అనంతారం గ్రామంలోని బిక్కేరు వాగుకు గంధమల్ల నుంచి నీరు రావడంపై హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తుమ్మ డెన్నిస్‌రెడ్డి, నాయకులు రాజరత్నంతో పాటు సోమనర్సయ్య, యాదగిరి పాల్గొన్నారు.

మర్రి విజయలక్ష్మికి డాక్టరేట్



విజయలక్ష్మి

మోత్కూరు : మోత్కూరు మున్సిపాలిటీకి చెందిన మర్రి విజయలక్ష్మి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ ఎ.కృష్ణశైలజ పర్యవేక్షణలో ఫార్ములేషన్ అండ్ ఎవల్యూషన్ ఆఫ్ గ్యాస్ట్రో రిటైన్టివ్ ఫ్లోటింగ్ మైక్రోస్పియర్స్ ఆఫ్ యాంటీ హైపర్‌టెన్సివ్ డ్రగ్స్ అనే అంశంపై తాను చేసిన పరిశోధనకుగాను డాక్టరేట్ అందుకున్నట్లు శుక్రవారం ఆమె స్థానిక విలేకరులకు తెలిపారు. ప్రస్తుతం సిద్దార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఫార్మసీ డిపార్ట్‌మెంట్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చింతా సాయిలు, బీఓఎస్ ప్రొఫెసర్ రమేష్‌కుమార్, మాజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్యామ్‌సుందర్, ప్రొఫెసర్ శ్రీనునాయక్, ఓయూ ఎగ్జిక్యూటివ్ మాజీ కౌన్సిల్ మెంబర్ పెరక శ్యామ్, ఓయూ జేఏసీ నాయకులు మర్రి అనిల్‌కుమార్ ఆమెను అభినందించారు.

గొర్ల పెంపకందారుల సహకార సంఘం అభివృద్ధికి కృషి

ఆలేరురూరల్ : గొర్ల పెంపకందారుల సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఆ సంఘం జిల్లా డైరెక్టర్ జల్లి నర్సింహులు అన్నారు. శుక్రవారం ఆలేరు పట్టణ కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడా రు. దసరా పండుగ సందర్భంగా బీరప్ప గొర్రెల పెంపకందారుల సభ్యులకు ఒక్కొక్కరికి రూ. 8500 చొప్పున మొత్తం రూ.20 లక్షలు బోనస్ కింద అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం సభ్యులు పత్తి వెంకటేష్, మైలం శ్రీశైలం, ఎగ్గిడి శ్రీశైలం, ఉప్పలయ్య, మల్లేషం, సిద్దులు, రామూర్తి పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మిరపలో సమగ్ర సస్యరక్షణపై శిక్షణ



నేలపై వేసిన గ్రామ పటంలో వనరుల వివరాలను వివరిస్తున్న విద్యార్థినులు

భువనగిరి రూరల్ : మండలంలోని అనాజిపురం గ్రామ రైతు వేదికలో మిరపలో సమగ్ర సస్య రక్షణ అనే అంశంపై రైతులకు జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా నేలపై పటం వేసి గ్రామంలో గల వనరులను, సంస్థలను చూపిస్తూ వివరించారు. అనంతరం ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ అనీల్ కుమార్ మాట్లాడారు. మిరపలో సమగ్ర సస్యరక్షణ చర్యలను వివరించారు. ప్రస్తుతం వరి, పత్తి పంటల్లో చేపట్టాల్సిన సమగ్ర చీడపీడల నివారణపై వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థినులు సాయిశ్రీ, హర్షిత, ఉషారాణి, రుచిత, సుప్రియ, అభ్యుదయ రైతులు చంద్రయ్య, మల్లేశ్, పాండు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. అన్నదానాలు



యాదగిరిగుట్ట : కొత్తగుండ్లపల్లిలో అమ్మవారి వద్ద పూజలు చేస్తున్న విప్ ఐలయ్య దంపతులు

భువనగిరి : దేవి శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా పట్టణంలో నెలకొల్పిన దుర్గామాత వద్ద శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆజాద్‌రోడ్డులో శ్రీ రామభక్త భజన మండలి కమిటీ ఆధ్వర్యంలో నెలకొల్పిన దుర్గాదేవి మండపం వద్ద శుక్రవారం సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు.

భూదాన్‌పోచంపల్లి : మండల వ్యాప్తంగా దుర్గాదేవి శరన్నవరాత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. అందులో భాగంగానే శుక్రవారం భీమనపల్లి గ్రామంలో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి గాయత్రీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి సహస్ర కుంకుమార్చన, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు కందాల జైపాల్‌రెడ్డి, కర్నాటి పాండు, బీరెడ్డి మల్లేశం, కల్యాణి శ్రీకాంత్, వడ్డేమోని వెంకటేశం, చిల్వేరు నర్సింహ, బూర్గు శ్రీను, కప్పల రవి, బూరుగు శ్రీకాంత్, కందాల శివప్రసాద్ పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట : పట్టణంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాల వద్ద ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య దంపతులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని శ్రీరాంనగర్, కొత్త గుండ్లపల్లి, యాదగిరిపల్లి, వైకుంఠద్వారం వద్ద ఏర్పాటు చేసిన అమ్మవార్ల మండపాల వద్ద నిర్వాహకులు అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించి విశేష పూజలు, కుంకుమార్చనలు చేశారు.

చౌటుప్పల్ : పట్టణంలో శ్రీదుర్గాదేవి శరన్నవరాత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం రెండో రోజు అమ్మవారు అన్నపూర్ణాదేవి అవతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక శ్రీసీతా రామచంద్రస్వామి, శ్రీమార్కండేయస్వామి దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పోలోజు శ్రీధర్‌బాబు, ఉత్సవ నిర్వాహకులు బడుగు శ్రీరాములు, వనం ధనుంజయ్య, ముత్యాల హన్మంతరెడ్డి, తాడూరి పరమేష్, వక్కంటి రాజాచంద్ర, సందగళ్ల నాగరాజు, గోశిక నర్సింహ, వెంకటలక్ష్మి, తిరుమల్‌రెడ్డి, గోశిక భావనాఋషి, బత్తుల యశ్వంత్ పాల్గొన్నారు.

మోత్కూరు : మున్సిపల్ కేంద్రంలోని పాత పోస్టాఫీస్ బజార్‌లో ఏర్పాటు చేసిన దుర్గామాతకు విశ్వ బ్రాహ్మణులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారు గాయత్రీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో విగ్రహ దాత మోత్కూరు బ్రహ్మాచారి, అర్చకులు సోమనర్సయ్య, నాగరాజు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు పోలినేని ఆనందమ్మ, స్వామిరాయుడు దంపతులు, బయ్యని రాజు, సజ్జనం మనోహర్, తదితరులు పాల్గొన్నారు.



భువనగిరి : సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళా భక్తులు



మోత్కూరు : దుర్గామాత వద్ద పూజలు చేస్తున్న భక్తులు



ఆత్మకూరు(ఎం)లో..



భువనగిరి : మీనానగర్‌లో ..

బొమ్మలరామారం : ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. మండల కేంద్రంలో శివ యువజన సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన అమ్మవారిని శుక్రవారం ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలన్నారు. అనంతరం అమ్మవారి మండపం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

వలిగొండ : మండలంలో శివాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారు శుక్రవారం గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ నాయకుడు కొండూరు భాస్కర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు కుంకుమార్చన చేశారు. కార్యక్రమంలో శిష్టి సతీష్, మాటూరి శివ, బచ్చు శ్రీనివాస్, సోమ శ్రావణ్, తుమ్మల పవన్, హరీష్, ప్రభాస్ పాల్గొన్నారు.

రామన్నపేట : దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలో శుక్రవారం అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించారు. గులాబీ పూలతో పుష్పార్చన చేసి పొంగలిని నైవేద్యంగా సమర్పించారు.

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలోని శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన అమ్మవారు శుక్రవారం గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

సంస్థాన్ నారాయణపురం: సంస్థాన్ నారాయణపురం, జనగాం, దుబ్బాల, సర్వేల్, పుట్టపాక గ్రామాల్లో నెలకొల్పిన దుర్గాదేవి వద్ద శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో నేప తి శ్రీనివాసులు, నోముల వెంకట్‌రెడ్డి, బోడపట్ల భాస్కర్‌రెడ్డి, తండ నర్సింహ్మా, బొంగు రఘు, బెలిదె రవి, వెన్‌రెడ్డి సుభాష్‌రెడ్డి, గుంటోజు తోటచారి, రమేష్, బెలిదె భవాని, అంబిక, చైతన్య తదితరులు పాల్గొన్నారు.



వలిగొండలో దుర్గాదేవికి పూజలు చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు



బొమ్మలరామారం : అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

వారసులకు ఉద్యోగ అవకాశం కల్పించాలి

భువనగిరి : గత ప్రభుత్వం తీసుకువచ్చి అమలు చేసిన జీఓ 81 వలన కనీస ఆర్థిక భద్రత లేకుండా ఉద్యోగ విరమణకు చేరువయ్యామని..ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపి తమ వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరుతూ పూర్వ వీఆర్‌ఏలు శుక్రవారం ఆర్డీఓ అమరేందర్‌కు వినతి అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ నెల 6న రెవెన్యూ శాఖ మంత్రితో జరగనున్న సమావేశంలో తమ సమస్యల గురించి చర్చించాలని వినతి పత్రంలో కోరారు. తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సాయిలు, వెంకటేష్,ఊశయ్య, వెంకటయ్య, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీఓ అమరేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పూర్వ వీఆర్‌ఏలు

ప్రమాదకరంగా వ్యవసాయ బావి



నారాయణగిరి సమీపంలో రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న వ్యవసాయబావి

భూదాన్‌పోచంపల్లి : మున్సిపాలిటీ పరిధిలోని నారాయణగిరి గ్రామానికి వెళ్లే మార్గంలో వ్యవసాయబావి ప్రమాదకరంగా ఉంది. ఈ బావి రోడ్డుకు ఆనుకుని నిండా నీటితో ఉండడంతో ఎప్పుడే ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు జంకుతున్నారు. ఈ వ్యవసాయబావి వద్ద ప్రమాదాలు జరుగకుండా గతంలో రక్షణ గోడను నిర్మించారు. అయితే ఇటీవల డ్రైయినేజీ ఔట్‌లెట్‌ను బావిలో కలిపేందుకు రక్షణ గోడను తొలగించారు. కానీ అధికారులు తిరిగి రక్షణ గోడను నిర్మించడం మరిచారు. బావి సమీపంలో ఉన్న రోడ్డు ఇరుగ్గా ఉండడంతో ఇటీవల కురిసిన వర్షానికి రోడ్డు వ్యవసాయ బావివైపు కుంగి ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డు గుండా వెళ్లే వారికి దగ్గరికి వచ్చే వరకూ ఇక్కడ బావి ఉన్న సంగతి తెలియడంలేదు. ఇక కొత్త వారు వస్తే బావి ఉన్న విషయం తెలియక ప్రమాదం జరిగే ఆస్కారం లేకపోలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వ్యవసాయ బావి వద్ద రక్షణ గోడను నిర్మించాలని పలువురు కోరుతున్నారు.